క్లుప్తంగా

నేడు పెద్దకొండూరులో విజయసంకల్పయాత్ర

కలిగిరి: మండలంలోని పెద్దకొండూరు పంచాయతీ పరిధిలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయసంకల్పయాత్ర నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటం రవీంద్రారెడ్డి గురువారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

చలివేంద్రం ప్రారంభం



సంగం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో కారుస్టాండ్ యూనియన్ నాయకులు గురువారం చలివేంద్రం ప్రారంభించారు. ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని బస్టాండ్ సెంటర్‌లో ప్రయాణికులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో తమ యూనియన్ ద్వారా మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

నేడు బోగోలు మండలంలో ఎన్నికల ప్రచారం

బిట్రగుంట: బోగోలు మండలం కోళ్లదిన్నె, ముంగమూరు, కడనూతల, కోవూరుపల్లి, విశ్వనాథరావుపేట పంచాయతీల్లో శుక్రవారం కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు కోళ్లదిన్నె నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభమవుతుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు క్లస్టర్ ఇన్‌చార్జిలతో సమావేశం

ఆత్మకూరు: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు, నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశానికి మండల నాయకులు హాజరుకావాలని తెలిపారు.

వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న సీఐ రవినాయక్

సంగం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సంగం సీఐ రవినాయక్, ఎస్సై నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో సంగం చెక్‌పోస్టు, ఉడ్‌హౌస్‌పేట వద్ద జాతీయ రహదారిపై గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రతి వాహనాన్ని నిలిపి క్షుణ్ణంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రూ.50 వేలకు మించి నగదును ఎవరూ బయటకు తీసుకురావద్దని సూచించారు. ప్రజలు తప్పనిసరిగా ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు అక్రమంగా నగదు, మద్యం రవాణా జరగకుండా గట్టి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఆటో అదుపుతప్పి..

సోమశిల: అనంతసాగరం మండలం ఎగువపల్లి సమీపంలో జాతీయ రహదారిపై గురువారం బద్వేల్ నుంచి కలువాయికి వస్తున్న కూరగాయల ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. దీంతో ఒకరికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సోమశిల ఎస్సై సుబ్బారావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. స్థానికుల సహకారంతో ఆటోను బయటకు తీశారు.

సిమెంట్ బెంచీల వితరణ

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి కాటంరెడ్డి రవీంద్రారెడ్డి ఆ పాఠశాలకు సిమెంట్ బెంచీలను వితరణగా అందజేశారు. గురువారం ఆ పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఒంటేరు మల్లికార్జున ద్వారా బెస్ట్ మిత్రుల వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా నాలుగు సిమెంటు బెంచీలను బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనంతలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు చెల్లించండి

అల్లూరు: సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలని అల్లూరు నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్ కోరారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 2023–2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చెల్లించాల్సిన ఇంటి పన్ను బకాయిలను మార్చి 31వ తేదీ లోపు చెల్లించాలని కోరారు. మార్చి 31వ తేదీ లోపు ఇంటి పన్ను మొత్తం ఒకేసారి చెల్లించిన వారికి వడ్డీ రాయితీ పొందే అవకాశం ఉందని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కావలి ఎమ్మెల్యే అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



గ్రామదేవత నందెమ్మ అమ్మవారి వద్ద ప్రచార పత్రాన్ని మహిళకు అందజేస్తున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎంపీ బీద మస్తాన్‌రావు

- రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్‌తో ఉజ్వల భవిష్యత్
- వైఎస్సార్‌సీపీ కావలి ఎమ్మెల్యే అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తన లక్ష్యమని వైఎస్సార్‌సీపీ కావలి ఎమ్మెల్యే అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కావలి రూరల్ మండలం పెద్దపట్టపుపాళెం పంచాయతీ నందెమ్మపురం నుంచి ఎమ్మెల్యే తన ఎన్నికల ప్రచారాన్ని గురువారం ప్రారంభించారు. సెంటిమెంట్ ప్రకారం నందెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావుతో కలిసి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కావలి నియోజకవర్గ అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో దశాబ్దాలుగా కలగా మిగిలిపోయిన రామాయపట్నం పోర్టును సాకారం చేయడంతో పాటు మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపే జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను కూడా పూర్తి చేసినట్లు తెలిపారు. పోర్టు, హార్బర్ ద్వారా తీరంలో ఊహించని స్థాయిలో అభివృద్ధి జరగనుందన్నారు. జువ్వలదిన్నె హార్బర్‌కు అనుబంధంగా ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలు, ఇంటిగ్రేటెడ్ ఫుడ్‌పార్క్‌లతో వందలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. వీటితోపాటు ప్రతిపాదిత దశలో ఉన్న పారిశ్రామిక కారిడార్ కూడా సాకారమైతే రానున్న ఐదేళ్లలో కావలి నియోజకవర్గ రూపురేఖలే మారిపోతాయన్నారు. యువతకు స్థానికంగా ఉద్యోగావకాశాలు లభించడంతోపాటు వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ రంగం కూడా పుంజుకుని భూముల ధరలు పెరుగుతాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఒకవైపు నియోజకవర్గ అభివృద్ధితోపాటు పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలోనూ ఎక్కడా వెనుకడుగు వేయలేదని గుర్తుచేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. గడపగడపకూ మనప్రభుత్వం ద్వారా ఇంటింటికి తిరిగి మరీ పథకాలు రాని వారిని గుర్తించి పథకాలు అందించినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు మళ్లీ ఫ్యాన్ గుర్తుకే ఓటేసి కావలి ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

అడుగడుగునా ఆత్మీయ స్వాగతం

వైఎస్సార్‌సీపీ కావలి ఎమ్మెల్యే అభ్యర్థి ప్రతాప్‌కుమార్‌రెడ్డి 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నందెమ్మపురం నుంచి ప్రచారభేరి మోగించగా అడుగడుగునా ప్రజల నుంచి ఆత్మీయ స్వాగతం లభించింది. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ శ్రేణులు, మత్స్యకార గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. కావలి పట్టణంలోని తన నివాసం నుంచి సతీమణి ఆదిలక్ష్మి, కుమారుడు, కోడలు, కుమార్తె, అల్లుడుతో కలిసి నందెమ్మపురం గ్రామానికి బయలుదేరిన ఎమ్మెల్యే తొలుత నందెమ్మతల్లిని దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే తమకు మంచి రోజులు వచ్చాయంటూ ఎమ్మెల్యేతో తమ సంతోషాన్ని పంచుకున్నారు. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లతో తమ ప్రాంతానికి వెలుగులు వచ్చాయని, ఇకపై పొట్టకూటి కోసం చెన్నై, గుజరాత్, ముంబై తదితర ప్రాంతాలకు వలస పోవాల్సిన అవసరం లేదని తెలిపారు. మా ఓటు మళ్లీ జగనన్నకే.. చంద్రబాబు చీకటి రోజులు గుర్తు చేసుకోవడం మాకు ఇష్టం లేదు అంటూ మత్స్యకార గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో తెలిపారు. రానున్న ఎన్నికల్లో కావలి ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని మరోసారి భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు. జై జగన్.. జై వైఎస్సార్‌సీపీ.. అంటూ పార్టీ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్, కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, జంపాని రాఘవులు, దండా కృష్ణారెడ్డి, తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, పందిటి కామరాజు, గంధం ప్రసన్నాంజనేయులు, నగళ్ల శ్రీనివాస కిరణ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

మర్రిపాడు: నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిని గురువారం వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఉన్న మేకపాటి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై వారు చర్చించుకున్నారు. ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేశామని, మర్రిపాడు, సీతారామపురం మండలాలకు సాగు, తాగునీరు అందించడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక చొరవ తీసుకుంటామని విజయసాయిరెడ్డి తెలిపారు. హైలెవల్ కెనాల్ పూర్తి చేసి మర్రిపాడు మండలాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా ముందుకుసాగుతామని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి తెలిపారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, యువ నాయకుడు మేకపాటి అభినవ్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్ తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన విష్ణువర్ధన్‌రెడ్డి



ముఖ్యమంత్రిని కలిసిన విజయసాయిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సుకుమార్‌రెడ్డి

కావలి: 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా బుధవారం రాత్రి నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ముఖ్యమంత్రి సూచనల మేరకు వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి వ్యక్తిగతంగా అల్లూరుకు వెళ్లి మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఇరువురు మధ్య జరిగిన చర్చల అనంతరం విష్ణువర్ధన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలవడానికి సుముఖత వ్యక్తం చేశారు. దీంతో విజయసాయిరెడ్డితో కలిసి విష్ణువర్ధన్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డిలు ఆళ్లగడ్డలో ముఖ్యమంత్రిని కలిసి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు.

సమైక్యతకు నిదర్శనం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

సోమశిల: పండగలు ఐకమత్యానికి ప్రతీకలని, రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొనడం సమైక్యతకు నిదర్శనమని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని అనంతసాగరంలో ముస్లిం మైనారిటీల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు. తొలుత స్థానిక దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ఎమ్మెల్యే ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మైనారిటీలకు పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంపూర్ణమ్మ, జేసీఎస్ కన్వీనర్ అంకిరెడ్డి, సర్పంచ్ శోభ, బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, చేజర్ల జెడ్పీటీసీ సభ్యుడు పీర్ల పార్థసారథి, ఎంపీటీసీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు కరిముద్దిన్, సాగరం చెరువు ప్రెసిడెంట్ మౌలా, సొసైటీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకుడు బట్రెడ్డి నాగేంద్ర సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించండి



బిల్లుపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

చేజర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఓటర్లను కోరారు. గురువారం మండలంలోని బిల్లుపాడు, యనమదల, ఎర్రబల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి ఎర్రగుంట పెంచలయ్య మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యనమదల సర్పంచ్ సుందరరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎ.మస్తాన్‌రెడ్డి, పెంచలయ్య, కోటేశ్వరరావు, గోపాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

దుత్తలూరు: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ సైమన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థులు మే 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉందని తెలిపారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తదితరులు

ఉదయగిరి: మండలంలోని గండిపాళెంలో గురువారం రాత్రి ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు జి.ఓబుల్‌రెడ్డి, దుగ్గిరెడ్డి గురవారెడ్డి, పాముల రమణయ్య, మూలె వినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పరామర్శ



సర్వేయర్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

సోమశిల: ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన సచివాలయ సర్వేయర్ కేతా విష్ణువర్ధన్ కుటుంబ సభ్యులను గురువారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. మండలంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామంలో సర్వేయర్ విష్ణువర్ధన్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే ఆ కుటుంబంతో మాట్లాడారు. ప్రభుత్వపరంగా వారి కుటుంబానికి రావాల్సిన ఆర్థికసాయం అందేలా చూస్తామని ఎమ్మెల్యే వారికి భరోసా కల్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కావలిని దోచుకోవడమే 'కావ్య' పన్నాగం

- ఆప్కాఫ్ రాష్ట్ర చైర్మన్ కొండూరు అనిల్‌బాబు



మాట్లాడుతున్న కొండూరు అనిల్‌బాబు

కావలి: కావలి నియోజకవర్గాన్ని దోచుకోవడమే కావ్య కృష్ణారెడ్డి పన్నాగమని రాష్ట్ర ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు అన్నారు. కావలిరూరల్ మండలం నందెమ్మపురంలో ఆయన మాట్లాడుతూ కావలి నియోజకవర్గ ప్రగతిని, భవిష్యత్ వృద్ధిని అంచనా వేసిన కావ్య కృష్ణారెడ్డి అడ్డంగా దోచుకునేందుకు టీడీపీ టికెట్‌తో పోటీలో దిగారని తెలిపారు. అహంకారం, రౌడీయిజం, కవ్వింపు చర్యలతో ఉన్న కావ్య కృష్ణారెడ్డి వైఖరిని కావలి ప్రజలు గమనిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కావ్య భరతం పట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కావలి నియోజకవర్గంలో 2014 అసెంబ్లీ ఎన్నికల నుంచి ఒక్కోసారి ఒక్కో అభ్యర్థిని టీడీపీ నిలబెడుతుంటే వైఎస్సార్‌సీపీ తరపున ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఒక్కరే ఒంటరిగా ఎదుర్కొంటున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కావలి ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ఎమ్మార్పీఎస్ సమావేశాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వాసుదేవరావు

ఆత్మకూరు: గుంటూరులో ఈ నెల 30వ తేదీన ఎమ్మార్పీఎస్ రాష్ట్రస్థాయి సమావేశం జరగనుందని, ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి సూరిపాక వాసుదేవరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో గురువారం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. వాసుదేవరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్, కార్యవర్గ సభ్యులు మహేష్, ఆదినారాయణ, గంగపట్ల లక్ష్మమ్మ, అడివయ్య, అంకయ్య, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల శిక్షణకు గైర్హాజరైతే చర్యలు

- పీఓలు, ఏపీఓలు 100 శాతం హాజరయ్యే బాధ్యత ఆర్‌ఓలదే
- కలెక్టర్ ఎం.హరినారాయణన్



ఉదయగిరి: శిక్షణకు హాజరైన సిబ్బంది హాజరును పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

ఆత్మకూరు: 2024 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలకు వారు గైర్హాజరైతే చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ హెచ్చరించారు. గురువారం ఉదయగిరి, ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ అధికారులకు పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 13న ఎన్నికల పోలింగ్ జరగనున్న దృష్ట్యా ఎలాంటి పొరపాట్లు లేకుండా పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో రెండు విడతల్లో సుమారు 16 వేల మంది పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొదటి విడత శిక్షణ కార్యక్రమం రిటర్నింగ్ అధికారుల సమక్షంలో పూర్తి చేశామన్నారు. పోలింగ్ అధికారులందరూ ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని సందేహాలను ముందుగానే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి నూటికి నూరు శాతం సిబ్బంది హాజరయ్యేలా రిటర్నింగ్ అధికారులు బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ ఆర్‌ఓలను ఆదేశించారు. శిక్షణకు హాజరవుతున్న పోలింగ్ అధికారులకు, సిబ్బందికి మంచి భోజనం అందించాలని, ఎక్కడా రాజీ పడకుండా నాణ్యతా ప్రమాణాలతో కూడిన అల్పాహారం, భోజనం ఏర్పాటు చేయాలని ఆర్‌ఓలకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.మధులత, ఎంఈఓ షేక్ నజీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

సంగం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ ఎం.హరినారాయణన్ గురువారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించి బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. ఓటర్ల జాబితాలో తొలగించిన పేర్లు, దివ్యాంగ ఓటర్లు, 85 సంవత్సరాలు నిండిన ఓటర్ల వివరాలను బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐ, వీఆర్‌ఓ, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఉదయగిరిలో..

ఉదయగిరి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలకు వారు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. ఆయన గురువారం ఉదయగిరిలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో ఎన్నికల నిర్వహణకు నియమించిన పీఓ, ఏపీఓల శిక్షణ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న పోలింగ్ జరగనున్న దృష్ట్యా ఎలాంటి తప్పిదాలు తలెత్తకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో రెండు విడతల్లో 16 వేల మంది పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన శిక్షణ రిజిస్టర్లు, మాడ్యూల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్, సహాయ ఎన్నికల అధికారి నెఫ్రూబాబు తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

ఉదయగిరి: ఉపాధి హామీ పథకం ఉదయగిరి క్లస్టర్ పరిధిలో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలకు పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని ఏపీడీ గాయత్రీదేవి తెలిపారు. ఆమె గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేటాయించిన లక్ష్యాలు నూరు శాతం పూర్తి చేయాలన్నారు. అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని, క్లస్టర్ పరిధిలో రోజువారీ ఉపాధి కూలీల సంఖ్యను పెంపుదల చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాగళానికి ప్రజలేరీ



సభలో ఆనం మాట్లాడుతున్న సమయంలో ఖాళీ అయిన కుర్చీలు

ఆత్మకూరు: టీడీపీ ఆత్మకూరు నియోజకవర్గ తొలి ప్రజాగళం బహిరంగ సభ ఏఎస్‌పేట మండల కేంద్రంలో గురువారం రాత్రి నిర్వహించారు. ఆ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ఇద్దరు కలిసి ఏఎస్ పేట దర్గాలో ప్రార్థనలు నిర్వహించారు. కాగా మండలంలోని పలు గ్రామాల నుంచి ట్రాక్టర్లు, ఆటోల ద్వారా ప్రజలను బహిరంగ సభకు తరలించారు. అయితే ర్యాలీగా వచ్చిన అనంతరం బహిరంగ సభ ప్రారంభమయ్యే వరకు కొంతమేర జనం ఉన్నా ప్రధాన నాయకులు మాట్లాడుతున్నప్పుడే మహిళలు సభ నుంచి వెళ్లిపోయారు. ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. దీంతో తొలి ప్రజాగళం సభ పేలవంగా జరిగిందని పలువురు వ్యాఖ్యానించారు.